సాక్షి
వరంగల్
బుధవారం । 17 । జూలై । 2024



పాత కక్షలే.. ప్రాణం తీశాయి

పాత కక్షలతోనే బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ దేవేందర్‌ను ప్రత్యర్థులు హత్యచేశారని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

- 8లో▸



అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను మడికొండ పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీటీఓకు టీఎస్‌యూటీఎఫ్ వినతి



కాశీబుగ్గ సెంటర్: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు వేతనాల తీసుకునేందుకు, బిల్లులు అందజేసేందుకు ఆయా పోస్టులను అప్‌డేట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు తాటికాయల కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఖజానా అధికారి (డీటీఓ)ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు త్వరితగతిన పోస్టులను అప్‌డేట్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు, కోశాధికారి ఎస్‌ఏ రవూఫ్ పాల్గొన్నారు.

బాలుడి మృతిపై విచారణ



నెక్కొండ: మండలంలోని ముదిగొండలో పదేళ్ల బాలుడు మణిదీప్ మృతిపై నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుడి మృతి ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన నేపథ్యంలో తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) సుమోటోగా కేసు నమోదు చేసిందని తెలిపారు. టీజీఎంసీ ఆదేశాల మేరకు గ్రామంలో విచారణలో భాగంగా బాలుడి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించామన్నారు. అలాగే, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్‌ఎంపీని సైతం విచారించామని ఆయన పేర్కొన్నారు. విచారణ పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెప్పారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు పంపిణీ



నల్లబెల్లి: విద్యుదాఘాతంతో మండలంలోని వేదనగర్‌లో బైకాని కవిత మృతి చెందింది. దీంతో ఎక్స్‌గ్రేషియా కోసం ఆమె కుటుంబ సభ్యులు దరఖాస్తు చేయగా రూ.ఐదు లక్షల చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డీఈ శ్రీధర్, ఏడీఈ లక్ష్మణ్, ఇన్‌చార్జ్ ఏఈ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, నాయకులు జిల్లా మునేందర్, సంపత్‌రెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు విధానాలే అధిక దిగుబడికి సోపానాలు



దుగ్గొండి: రైతులు చేసే సాగు విధానాలే అధిక దిగుబడికి సోపానాలుగా నిలుస్తాయని రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ చేరాలు అన్నారు. నాచినపల్లి గ్రామంలో జయశంకర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మిరప, పసుపు రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మిరప నారు పెంపకం, నాటిన నాటి నుంచి చేపట్టాల్సిన చర్యలు, సస్యరక్షణ పద్ధతులు, పసుపు సాగు పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో పోతన స్వచ్ఛంద సంస్థ మేనేజర్ వెంకటరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, టీసీ రవికుమార్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాట సీడీ ఆవిష్కరణ



దుగ్గొండి: మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాసులు 'విద్యార్థి ఓ విద్యార్థి చదువులో కావాలి నీవు ప్రసిద్ధి అనే పాట రాసి పాడారు. ఈ మేరకు సీడీని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మంగళవారం పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి, పాఠశాల అభివృద్ధికి పాటలతో ప్రచారం చేస్తున్న శ్రీనివాసులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసులు, రజిని, రఘు, స్వప్న, వేణుగోపాల్ పాల్గొన్నారు.

హెల్త్ కిట్లు లేనట్టేనా?



విద్యార్థినులకు పంపిణీ చేసిన హైజిన్ కిట్లు (ఫైల్)

కరోనాకు ముందు ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ

- ఆ తర్వాత నిలిపివేసిన సర్కారు
- హైజిన్ కిట్లు అందించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి
- జిల్లాలో 13 మండలాలు.. 10,548 మంది విద్యార్థినులు

చెన్నారావుపేట: ఇంటిలోనే కాదు.. బడిలో కూడా బాలికలు ఆడుతూ పాడుతూ తిరుగుతుంటే ఆ సందడే వేరుగా ఉంటుంది. బాలికలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలతో బడికి దూరం కాకూడదని గత ప్రభుత్వం హైజిన్ కిట్ల (హెల్త్ కిట్ల) పంపిణీకి శ్రీకారం చుట్టింది. 2018–19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు అందించింది. మూడు నెలలకోసారి మూడు రకాల వస్తువులు పంపిణీ చేసింది. 2020 మార్చిలో కరోనాతో పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో అప్పటి నుంచి ఆరోగ్య కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 10 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), 6 మోడల్ స్కూళ్లు, 125 ఉన్నత పాఠశాలలు, 70 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 13 మండలాల్లో 10,548 మంది విద్యార్థినులు ఉన్నారు. వారికి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఆరోగ్యంపై జాగ్రత్తలు తెలియజేస్తూ వ్యాధుల బారిన పడకుండా హైజిన్ కిట్లు పంపిణీ చేశారు. కరోనా కాలంలో పాఠశాలలు మూసివేయడంతో కిట్ల పంపిణీ నిలిపివేశారు. కరోనా అనంతరం 2021 సెప్టెంబర్ 1 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైనా ప్రభుత్వం ఆరోగ్యం కిట్ల పంపిణీ చేపట్టలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య కోసం చర్యలు తీసుకుంటోంది. మౌలిక వసతులతోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు శ్రీకారం చుట్టింది. అయితే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం హైజిన్ కిట్ల పంపిణీ పునః ప్రారంభించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండలాల వారీగా విద్యార్థినుల వివరాలు

చెన్నారావుపేట	608
దుగ్గొండి	415
గీసుకొండ	889
ఖానాపురం	540
ఖిలా వరంగల్	1,359
నల్లబెల్లి	460
నర్సంపేట	864
నెక్కొండ	976
పర్వతగిరి	605
రాయపర్తి	741
సంగెం	692
వరంగల్	1,851
వర్ధన్నపేట	548
మొత్తం	10,548

హెల్త్ కిట్లు పంపిణీ చేయాలి



కరోనా కంటే ముందు హెల్త్ కిట్లు (హైజిన్ కిట్లు) అందించారు. కరోనా తర్వాత నిలిపివేశారు. సొంత ఖర్చులతో హెల్త్ కిట్లు కొనుగోలు చేసుకుంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హెల్త్ కిట్లు పంపిణీ చేయాలి.

– కృతిక, 9వ తరగతి విద్యార్థిని, చెన్నారావుపేట

ఇప్పుడు ఇస్తలేరు..



బడిలో చదువుకునే ఆడ పిల్లలకు ఆరోగ్య కిట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఇస్తలేరు. ఆ కిట్లు ఆడపిల్లల ఆరోగ్యానికి ఉపయోగపడేవి. మేము తెల్లారితే మా పనుల్లో ఉంటాం. మేము కొనియ్యలేకపోతున్నాం. గతంలో ఇచ్చినట్లు హెల్త్ కిట్లు ప్రభుత్వం ఇవ్వాలి.

– ధారావత్ కవిత, పేరెంట్, సూర్యాపేటతండా

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు భరోసా కల్పించడానికి హైజిన్ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. చాలా మంది బాలికలు కిట్లు కొనుగోలు చేసుకోలేని పరిస్థితి. మళ్లీ పంపిణీ చేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– రత్నమాల, ఎంఈఓ





సీఎం సమావేశంలో కలెక్టర్, సీపీ

హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సత్య శారదాదేవి, సీపీ అంబర్ కిషోర్ ఝా

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్



రామవరంలో పత్తిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్

రాయపర్తి(వర్ధన్నపేట): వానాకాలంలో సాగుచేస్తున్న పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ రైతులకు సూచించారు. వర్ధన్నపేట మండలంలోని రామవరం, దివిటిపల్లి, దమ్మన్నపేట గ్రామాల్లో పంటల నమోదును మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలను సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరిసాగు చేసే రైతులు పెసర, జీలుగ పచ్చిరొట్ట పైర్లను పూత దశలో ఎస్‌ఎస్‌పీ వేసుకొని నేలలో కలియదున్నాలన్నారు. పత్తిలో ఒక బస్తా డీఏపీ లేదా ఏదైనా ఒక కాంప్లెక్స్ ఎకరాకు విత్తిన 20 రోజుల్లోపు పదునులో వేసుకోవాలన్నారు. పత్తి, వరి, మొక్కజొన్న పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సారంగం, వర్ధన్నపేట ఏఓ సాగరిక, విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల్లో ఆనందం

- ఈ నెల 18లోగా రూ.లక్ష లోపు రుణాల మాఫీ
- కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు ప్రామాణికం
- జిల్లాలో 1,46,829 మంది రైతులు.. రూ.1,988 కోట్ల రుణాలు

సాక్షి, వరంగల్: రైతులకు రుణమాఫీ ప'రేషన్' తప్పింది. ఎప్పుడు రుణమాఫీ చేస్తారోనని సందిగ్ధంలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చినా.. రేషన్‌కార్డు ఉన్న రైతులకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందనడం ఎంతవరకు సమంజసమని ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావడంతో అధికార పార్టీ స్పష్టతనిచ్చింది. కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టామని, పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టతనివ్వడంతో జిల్లాలోని రైతులందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 18లోపు రూ.లక్ష లోపు రుణాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామనడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు జిల్లాలో 1,46,829 మంది రైతులు 20 బ్యాంకుల ద్వారా రూ.1,988 కోట్లు పంట రుణాలు పొందారు. కుటుంబం ప్రాతిపదికన రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో జిల్లాలో 2,81,039 మంది తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నారు. ఆ లెక్కలు తీసిన అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. అయితే, కాస్త గందరగోళం మధ్య రాష్ట్ర ప్రభుత్వం నుంచి పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ అని స్పష్టమైన ప్రకటన రావడంతో అందరు రైతులు లబ్ధి పొందనున్నారు. ఒకే కుటుంబంలో రూ.రెండు లక్షలకు పైగా రుణం తీసుకుంటే రూ.రెండు లక్షల వరకు మాత్రమే రుణమాఫీ అవుతుంది. కాగా, ఈ నెల 18లోగా రూ.లక్ష లోపు రుణాలు ఇవ్వనున్నారు. దీంతో జిల్లాలో దాదాపు 65 శాతం మంది ఖాతాల్లో ఈ డబ్బులు జమ అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి



అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కాశీబుగ్గ సెంటర్: రైతులు స్వేచ్ఛగా పంటలను అమ్ముకునేందుకు వరంగల్‌లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో అధికారులు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘం నాయకులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతే రాజు అనే చెప్పే ప్రభుత్వాలు రైతులను ఓట్ల రూపంగానే చూసి ఎన్నికల అనంతరం చేతులు దులుపుకుంటున్నాయని మండిపడ్డారు. వ్యవసాయ ఆధారిత భారతదేశంలో రైతులకు రక్షణ కరువైందని, ఇందుకు ఇటీవల కూరగాయ మార్కెట్‌లో జరిగిన సంఘటనే నిదర్శమన్నారు. పంటను అమ్ముకుందామనుకుని మార్కెట్‌కు వచ్చే రైతులపై వ్యాపారుల దగ్గర పనిచేసే గుమస్తాలు దురుసుగా ప్రవర్తించడం, దుర్భాషలాడడం, దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పంటలను అమ్ముకోవడానికి వచ్చే రైతులకు మార్కెట్‌లో రక్షణ లేకుండా పోయిందని, దీనికి మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లోపమేనని తెలిపారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో రైతులంతా ఐక్యమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిరుల రవీందర్, జెండా అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర చెల్లించి ఆదుకోవాలి

- గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాహిత రైతుల విజ్ఞప్తి

సంగెం: మార్కెట్ విలువ ప్రకారం భూములకు ధరలు చెల్లించి ఆదుకోవాలని గ్రీన్‌ఫీల్డ్‌హైవే భూనిర్వాసిత రైతులు సంగెం తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చింతలపల్లి, సంగెం, తిమ్మాపూర్, తీగరాజుపల్లి గ్రామాల రైతులతో పరిహారం అవార్డుపై మంగళవారం అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఎస్సారెస్పీ కెనాల్, ఉపకాల్వలు, రోడ్లు, టెక్స్‌టైల్ పార్కుకు భూములు ఇచ్చామని, మిగిలిన కొద్దిపాటి భూములే ఆధారంగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబపోషణ చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు మిగిలిన కొద్దిపాటి భూమి కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఇచ్చి ఎలా జీవించాలని ప్రశ్నించారు. మండలంలో ఎకరాకు మార్కెట్‌లో రూ.1.50 కోట్లకు పైగా ధరలు పలుకుతున్నాయని, వచ్చిన పరిహారంతో తిరిగి ఏడాదికి 2, 3 పంటలు పండే విలువైన భూమి కొనలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం డబ్బులు తీసుకుని రిహాబిటేషన్ కింద కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకుంటే ఆర్థిక స్థితిగతులు, ఇతర పరిస్థితులను అంచనా వేసి న్యాయం చేస్తారన్నారు. త్వరలో కలెక్టర్‌ను నిర్వాసిత రైతులు కలిసి తమ అభిప్రాయం విన్నవించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాదినేని రాంరెడ్డి, ఇండ్ల రవికుమార్, నాయకులు చింతల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

గీసుకొండ: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని నిర్వాసిత రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు తహసీల్దార్ రియాజుద్దీన్‌తో సమావేశమయ్యారు. కూతుళ్లకు కట్నం కింద ఇచ్చిన భూమి హైవే కింద పోతుండటంతో వివాదాలు ఏర్పడి అత్తింటివారు తమ ఇంటికి పంపిస్తున్నారని, దీంతో రెండు కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. తమకు ప్రభుత్వం నిర్ణయించిన ఎకరానికి రూ.18 లక్షల ధర కాకుండా ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. త్వరలో అదనపు కలెక్టర్‌తో నిర్వాసిత రైతుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు పరిహారం చెల్లించి ఆ తదుపరి ఆర్బిట్రేషన్ కింద వారు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే మరింత సాయం అందే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు. అయితే, ఈ ప్రతిపాదనను రైతులు వ్యతిరేకిస్తున్నారు.



సంగెం : మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

మార్కెట్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

వరంగల్: వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ వ్యవసాయ మార్కెట్లలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగుల బదిలీల కోసం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్కెట్‌లో సూపర్‌వైజర్ క్యాడర్‌లో పనిచేస్తున్న శివకుమార్, రమణ నర్సంపేట మార్కెట్, వెంకన్ననాయక్ వర్ధన్నపేటకు, వంశీ నెక్కొండకు బదిలీ అయ్యేందుకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వారిస్థానంలో చక్రబహద్దూర్‌రాయ్ వర్ధన్నపేట నుంచి, జ్యోతి ప్రకాశ్ నెక్కొండ నుంచి, సలీం నర్సంపేట నుంచి వరంగల్ మార్కెట్‌కు వచ్చేందుకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఏఎంఎస్ క్యాడర్‌లో కన్నయ్య వరంగల్ నుంచి నర్సంపేట మార్కెట్‌కు, జేఎంఎస్ క్యాడర్‌లో రజిత నర్సంపేటకు, ఆమె స్థానంలో శ్రీనివాస్‌రావు వరంగల్‌కు వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చారు. వరంగల్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మైరున్‌బీ నర్సంపేటకు, వాచ్ ఉమెన్ పద్మ వరంగల్ నుంచి నర్సంపేటకు, వినోద వర్ధన్నపేట నుంచి నెక్కొండకు, వాచ్‌మెన్ మార్త శ్రీనివాస్ వరంగల్ నుంచి వర్ధన్నపేట మార్కెట్‌కు బదిలీ అయ్యేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. ఈమేరకు బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. కాగా, కొత్త జిల్లాల వారీగా బదిలీ చేయడంపై మార్కెట్ ఉద్యోగుల సంఘం స్టేకోసం హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు స్టే ఇస్తుందా లేదా అనే విషయం రెండు రోజుల్లో తేలనుందని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు.

భూమి కోసం ఇరువర్గాల ఘర్షణ

- పర్షతండాలో వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఘర్షణ పడుతున్న రెండు గ్రామాల ప్రజలు

ఖానాపురం: భూమి కోసం ఇరువర్గాలు ఘర్షణపడిన సంఘటన పర్షతండాలో మంగళవారం జరిగింది. స్థానికులు, ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. అశోక్‌నగర్ గ్రామానికి చెందిన వెంకన్న 2015 సంవత్సరంలో పర్షతండా శివారులోని అశోక్‌నగర్‌కు చెందిన రాంరెడ్డి వారసుల వద్ద నుంచి ఎకరం భూమి కొనుగోలు చేశాడు. కానీ, ఆ భూమిలో ఇప్పటి వరకు ఎలాంటి పంటలు వేయలేదు. పంట సాగు చేద్దామని మంగళవారం తన పొలంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడానికి డోజర్ వాహనాన్ని తీసుకెళ్లి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పర్షతండావాసులు పొలం వద్దకు చేరుకుని డోజర్‌ను అడ్డుకున్నారు. భూమిలో తాము కొంతకాలంగా సీత్లా భవాని పండుగ జరుపుకుంటున్నామని, భూమి వదిలి వెళ్లిపోవాలని వెంకన్నతో వాగ్వాదానికి దిగారు. దీంతో వెంకన్న అశోక్‌నగర్‌లోని గ్రామస్తులకు తెలియజేయడంతో పెద్ద ఎత్తున గ్రామస్తులు భూమి వద్దకు చేరుకున్నారు. ఈక్రమంలో అశోక్‌నగర్, పర్షతండావాసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఘర్షణ తీవ్రం అవుతుండటంతో రైతు వెంకన్న పోలీసులకు విషయం తెలియజేశాడు. ఎస్సై రఘుపతి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. భూమికి సంబంధించిన పత్రాలతో స్టేషన్‌కు రావాలని, తగాదాలు పడొద్దని హెచ్చరించి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. దీంతో ఇరు గ్రామాల ప్రజలు వెళ్లిపోవడంతో ఘర్షణ సద్దుమణిగింది.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

పర్వతగిరి: మండలంలోని దేవీలాల్‌తండాలో ఓ విద్యార్థిని మంగళవారం రాత్రి అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ ఐశ్వర్య (16) కల్లెడ ఆర్డీఎఫ్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లి వచ్చేసరికి ఆమె చనిపోయి కనిపించింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పూర్తి వివరాలను సేకరించారు. కాగా, ఇటీవల ఐశ్వర్యకు మండలంలోని రోళ్లకల్ గ్రామానికి చెందిన యువకుడితో నిశ్చితార్థం జరిగింది. ఆమెకు తండ్రి గుగులోత్ మాల్యా, తల్లి అంబాలి, సోదరుడు ఉన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



నర్సంపేట పట్టణంలోని వనప్రేమి, పర్యావరణవేత్త గోకా రామస్వామి శాంతివనంలో సోమవారం రాత్రి 9 గంటలకు బ్రహ్మ కమలం వికసించింది. మూడు సంవత్సరాల క్రితం శాంతివనంలో ఆయన మొక్క నాటారు. రాత్రి 9 గంటలకు వికసించిన బ్రహ్మ కమలం మధ్యాహ్నం మూడు గంటల వరకు ముడుచుకుపోవడం ప్రత్యేకత. హిమాలయాల్లో మాత్రమే జీవించే ఈ మొక్క మన ప్రాంతంలో సైతం అరుదుగా పూసి వికసించడం ఆనందంగా ఉందని రామస్వామి తెలిపారు. - నర్సంపేట

ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి

గీసుకొండ: జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంతోపాటు సీజనల్ వ్యాధుల నివారణ కోసం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యసిబ్బందితో మంగళవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన వారికి పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణి పేరును నమోదు చేసి మూడు పరీక్షలు ఉచితంగా చేయాలన్నారు. వారికి ధనుర్వాతం టీకా, ఐరన్ పోలిక్ యాసిడ్ గోలీలు అందించాలని, వైద్యులతో పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించేలా చూడాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల వారు అనవసరమైన ఆపరేషన్లు, సీ సెక్షన్ ఆపరేషన్లు, చేయవద్దని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన శిక్షలు ఉంటాయని డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు.

అసంక్రమిత వ్యాధుల నివారణతోపాటు వర్షాకాలంలో పలురకాల దోమల ద్వారా వ్యాపించే జ్వరాలబారిన పడకుండా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. మానసిక సమస్యలతో బాధపడే వారి కోసం సైకియాట్రిస్టు డాక్టర్ భరత్‌కుమార్ అందుబాటులో ఉండాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మశ్రీ, పీహెచ్‌సీలు, పల్లెదవాఖానల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొగత.. ఫిదా



ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కనువిందు చేస్తోంది. మంగళవారం కొద్దిమంది పర్యాటకులు వచ్చి నప్పటికీ జలపాతం అందాలకు ఫిదా అయ్యారు. పాలనురగలా జాలువారుతున్న నీటి పరవళ్లతో నిండుగా కనిపిస్తుండడంతో వీక్షకులు ఫొటోలు తీసుకున్నారు. - వాజేడు

గంజాయి పట్టివేత కేసులో ఒకరికి పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి పట్టివేత కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి దేవానాయక్ కథనం ప్రకారం.. కేసముద్రం ఎస్సై తిరుపతి, ఏఎస్సై కృష్ణమూర్తి, పీసీలు సత్యనారాయణ, వెంకన్న గతేడాది అక్టోబర్ 16వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కేసముద్రం స్టేషన్ సెంటర్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. అతడి దగ్గర ఉన్న రెండు బ్యాగుల్లో 8 ప్యాకెట్లలో 16 కిలోల 290 గ్రాముల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్ తరలించారు. పట్టుబడిన వ్యక్తి ఒడిశాలోని గజం జిల్లా షేర్ గడ గ్రామానికి చెందిన రంజిత కుమార్ ప్రధాన్ గా గుర్తించి కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సీఐ బి.రమేశ్ విచారణ జరిపి అనంతరం బదిలీ కాగా ప్రస్తుత రూరల్ సీఐ పి.సర్వయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన కోర్టులో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ సర్వయ్య, ప్రస్తుత కేసముద్రం ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో సీడీఓ దేవానాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలువిన్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన రంజిత కుమార్ ప్రధాన్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. గంజాయి రవాణా చేస్తే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటనలో రాయపర్తి మండలం కొలాన్‌పల్లి గ్రామం జయరాం తండాకు చెందిన నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, రూ. 4వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలగీతాంబ మంగళవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొలాన్‌పల్లి గ్రామం బండకింది తండాకు చెందిన భూక్య గోపాల్ కుమార్తె రమను జయరాంతండాకు చెందిన లావుడ్యా శ్రీనుకు ఇచ్చి 2004లో వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అప్పటి వరకు బాగానే ఉన్న శ్రీను.. మద్యానికి అలవాటు పడి భార్యను అనుమానించి వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయం రమ తన తల్లిదండ్రులకు తెలుపగా పలుమార్లు పంచాయితీలు నిర్వహించారు. పెద్దల సమక్షంలో తన తప్పు ఒప్పుకుని, భార్యాపిల్లలను తీసుకుని వెళ్లేవాడు. అయినా శ్రీను ప్రవర్తనలో మార్పు లేదు. శ్రీను హింస భరించలేని రమ..2016, ఏప్రిల్ 22న వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో 2016, జూలై 1న చేనులో పత్తిగింజలు పెట్టడానికి వ్యవసాయ భూమి వద్దకు శ్రీను తన భార్యను తీసుకెళ్లాడు. మరుసటి రోజు కూడా పని ఉందని చేను వద్దకు తీసుకెళ్లాడు. 2016, జూలై 2న మధ్యాహ్నం 3 గంటలకు జయరాం తండాకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి రమపై శ్రీను కిరోసిన్ పోసి అంటించాడని చెప్పగా రమ తల్లిదండ్రులు కూతురు ఇంటికి వెళ్లారు. అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం తరలించారు. జరిగిన విషయం కూతురు రమను అడగగా కిరోసిన్ పోసి అంటించాడని తెలిపింది. చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత రమ మృతి చెందింది. మృతురాలి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ తీర్పు వెల్లడించారు. కేసును ఏసీపీ ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాశ్ పరిశోధించగా ఎస్సై వెంకటస్వామి పర్యవేక్షణలో హెచ్‌సీ సోము నాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.



‘తొలిఏకాదశి’.. సర్వశ్రేష్ఠం


కొడవటూరు సిద్ధులగుట్ట


బీరప్ప కామరతి, మహంకాళి దేవతామూర్తులు


బీరప్ప ఆలయం

నేడు పర్వదినం ప్రారంభం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చాతుర్మాస వ్రతాలు షురూ
- ముస్తాబవుతున్న శివ, విష్ణు ఆలయాలు
- పండుగలకు స్వాగతం

జనగామ: శివకేశవులు, విష్ణువుకు ప్రీతికరమైన రోజు.. ఉపవాసాలు, వత్రాలు ప్రారంభమయ్యే శుభదినం.. పండుగలకు స్వాగతం పలికే రోజు ‘తొలి ఏకాదశి’. ఆషాఢ మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని ‘తొలిఏకాదశి’ అంటారు. దీనినే ‘శయన ఏకాదశి’ అని కూడా పిలుస్తారు. ఉత్తర దిక్కున ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిక్కున ప్రయాణించడం వల్ల దీనిని దక్షిణాయణంగా పరిగణిస్తారు. అందుకే శివకేశవులు.. విష్ణువుకు ఈరోజు ప్రీతికరమైనదిగా భావిస్తారు. నేటి బుధవారం తొలిఏకాదశి సందర్భంగా శివ, వైష్ణవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆదిశేషుడి వాహనం కలిగిన నారాయణుడిని లక్ష్మి సమేతంగా పూజ చేయడం వల్ల సకల శ్రేయస్సు కలుగుతుంది. ఈరోజు ఉపవాసాలు, శివనామస్మరణ, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం సర్వశ్రేష్ఠం. తొలిఏకాదశి రోజున విష్ణు నామస్మరణ చేసే వారికి వైకుంఠ ప్రాప్తి కూడా కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు విష్ణువు యోగ నిద్రలో ఉంటాడు. చాతుర్మాస్యం ఈరోజు నుంచే మొదలవుతుంది. అందుకే ఈ నాలుగు మాసాలు ధర్మాచరణ కలిగి విష్ణు ప్రీతికై వ్రతాలు చేయడం నారాయణ అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం. నాలుగు మాసాల్లో వచ్చే ఏకాదశులకు ఇది మొదటిది కావడంతో ‘తొలిఏకాదశి’ అని పిలుస్తారు. తొలిఏకాదశి రోజున నదీ స్నానం పవిత్రమైనదిగా భావిస్తారు.

మూడు రోజుల పాటు వ్రతం..

ఈ ఏకాదశి వ్రతం మూడు రోజులు చేయాలి. రోజు శేషశాయిని అర్చించడం, ఏకాదశి పర్వదినం రోజున ఉపవాసం, ద్వాదశి పారాయణం, త్రయోదశి రోజున గీత నృత్యాదులతో అర్చన చేయాలి. చాతుర్మాస్య వ్రతం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ వ్రతం చేయాలనుకునే భక్తులు మొదటి రోజు నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు నిష్ఠతో స్వామికి పూజలు చేయాల్సి ఉంటుంది. పరమాత్ముడికి బెల్లం, తైలం, విడిచి పెడతామని సంకల్పించుకోవాలి. దేవుడికి నివేదన చేయని ఆహారం, పుచ్చకాయ, కాల్చి వండినవి, గుమ్మడికాయ, చెరకు, కొత్త ఊసిరిక, చింతపండు, మంచంపై పడుకోవడం, పరాన్నం, తేనె, పొట్లకాయ, ఉలవలు, తెల్ల ఆవాలు, మినుములు ఈ నాలుగు నెలల పాటు వినియోగించకుండా నిష్ఠతో భగవంతుడి సేవలో నిమగ్నం కావాలి. చాతుర్మాస్య వ్రతాలు, పూజలు చేసిన భక్తులకు దేవతల ఆశీస్సులు దక్కుతాయని భక్తుల విశ్వాసం.

ముస్తాబవుతున్న ఆలయాలు

తొలి ఏకాదశి సందర్భంగా జనగామ జిల్లాలోని పాలకుర్తి శ్రీ సోమేశ్వరాలయం, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధేశ్వరాలయం, జనగామ బాణాపురం శ్రీవెంకటేశ్వరాలయం, పాతబీటు శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీసంతోషిమాత ఆలయం, చిల్పూరు శ్రీ వెంకటేశ్వరాలయాలను సుందరంగా అలంకరిస్తున్నారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

నేడు కురుమ కులస్తుల బోనాలు

తొలి ఏకాదశి సందర్భంగా నేడు జనగామ పట్టణంలో కురుమ కులస్తులు బీరప్ప కామరతి, అక్క మహంకాళి దేవతామూర్తులకు బోనాలు సమర్పించనున్నారు. కుర్మవాడ నుంచి నెహ్రూపార్కు మీదుగా ఒగ్గుడోలు కళాకారుల వాయిద్యాలు.. శివసత్తుల నృత్యాలు.. పోతరాజుల విన్యాసాల మధ్య వేలాది మంది మహిళలు బోనాలతో పాటు పట్టువస్త్రాలతో బీరప్ప ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనం నైవేద్యం సమర్పించిన అనంతరం, పట్టువస్త్రాలు కానుకగా ఇచ్చి ఒడిబియ్యం పోస్తారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మికం

మొహర్రం.. వీరత్వానికి ప్రతీక

నేడు మధ్యకోటలో వేడుకలు

- సాయంత్రం 5గంటలకు భారీ ఊరేగింపు
- 200 ఏళ్ల చరిత్ర గల మధ్యకోట పీరీలు
- పీరీల బావి, చావడీల్లో ముమ్మర ఏర్పాట్లు
- మతాలకతీతంగా పీరీలను దర్శించుకోనున్న భక్తులు


పీరీలను నిమజ్జనానికి తరలిస్తున్న ముస్లింలు (ఫైల్)

ఖిలా వరంగల్: మొహర్రం.. వీర మరణానికి ప్రతీక. ధర్మ రక్షణ కోసం కర్బలా మైదానంలో విరోచితంగా పోరాడి వీరమరణం పొందిన వారికి గుర్తుగా మొహర్రం ఉత్సవాలు పీరీలను (సంతాప దినాలు) పది రోజులపాటు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయ రాజధాని ఖిలావరంగల్ కోట పీరీలకు సుమారు 200 ఏళ్ల ఘన చరిత్ర ఉంది . ఏటా పదో రోజు మొహర్రం పీరీల ఊరేగింపుల్లో వేలాది మంది కులమతాలకతీతంగా పాల్గొంటారు. ఈ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం. ముస్లింలు తమ ఆరాధ్యదైవంగా భావించే పీరీలను హిందువులు కూడా పూజిస్తారు. మొహర్రం సంతాప దినాల్లో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ముస్లింలు కూడా ఇక్కడకు చేరుకుని దర్శించుకుంటారు.

మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం..

మధ్యకోట.. బుధవారం జరగనున్న మొహర్రం వేడుకలకు ముస్తాబైంది. ఉదయం 4 గంటల నుంచే పీరీలకు ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం 5గంటలకు వేలాది ముస్లింల మధ్య భారీ ఊరేగింపు సాగనుంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు అధికారులు, ముస్లిం మతపెద్దలు పూర్తి చేశారు. చావడిల్లో నెలకొల్పిన పీరీలకు 200ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఇక్కడి హస్సేన్, హుస్సేన్ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం ఉంది. పీరీల ముజవార్ల పర్యవేక్షణ, మొహర్రం కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పీరీలను దర్శించుకుని ఊరేగింపులో పాల్గొంటారు. ఇప్పటికే పీరీలను రంగుల వస్త్రాలతో అలంకరించారు. తమ కోరికలు తీరిన వాళ్లు పీరీలకు వెండి, బంగారం, గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించనున్నారు.

పీరీల బావి వద్ద ఏర్పాట్లు పూర్తి

మధ్యకోట నుంచి పీరీలు భారీ ఊరేగింపుతో ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని కాశికుంట పీరీల బావి వద్దకు రాత్రి 12గంటలలోపు చేరుకుంటాయి. ఇక్కడ ముస్లిం మత్తపెద్దలు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తారు. మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ, సిద్ధం రాజు పరిశీలించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



త్యాగానికి ప్రతీకైన మొహర్రం ఊరేగింపునకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా మధ్యకోట పీరీల చావడీలను సందర్శించి ఊరేగింపు కొనసాగనున్న రహదారులను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా పరమైన ఆదేశాలు ఇచ్చారు. డీసీపీ ఆదేశాల ప్రకారం ఊరేగింపు పరిసరాల్లో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-నందిరామ్‌నాయక్, ఏసీపీ వరంగల్

పాత కక్షలే.. ప్రాణం తీశాయి

- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్రనాయక్
- మాజీ సర్పంచ్ దేవేందర్ హత్యకేసులో వీడిన మిస్టరీ


మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

రాయపర్తి : పాత కక్షలతోనే బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ దేవేందర్‌ను ప్రత్యర్థులు హత్య చేసినట్లు జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడించారు. మంగళవారం రాయపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ ఈనెల 7న సొంతిట్లో హత్యకు గురైన విషయం విధితమే. అయితే అదే గ్రామానికి చెందిన ఎనబోతుల ప్రకాశ్ నుంచి దేవేందర్ బయానా ఇచ్చి మూడెకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో డబ్బులు చెల్లించకపోడంతో పల్లె మల్లేశ్‌కు అదే భూమిని విక్రయించాడు. కాగా తాను కొన్న భూమిని నువ్వెలా కొంటావని పల్లె మలేశ్‌తో దేవేందర్‌కు రెండేళ్ల కింద భూ వివాదం తలెత్తింది. దీంతో గొడవలు కాగా దేవేందర్‌తో సహా పలువురిపై కేసు నమోదైంది. గత కొద్దికాలం క్రితం పల్లె మల్లేశ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అది మాజీ సర్పంచే చేయించాడని అతడిని హతమార్చాలని పథకం పన్నాడు. ఈనెల 7న దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న పల్లె మల్లేశ్ తన కుమారుడు మురళితో పాటు చెన్ననాయుడు, గోవింద్ మరికొందరితో కలిసి దేవేందర్ తలపై హ్యామర్‌తో కొట్టాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్, మొబైల్‌ను తీసుకుని వెళ్లిపోయారు. పోలీసులు వెతుకుతున్నట్లు గమనించిన పల్లె మల్లేశ్, చెన్ననాయుడు, గోవింద్ మంగళవారం లొంగిపోయారు. పరారీలో ఉన్న పల్లె మురళి, అతడితో ఉన్న మరికొందరికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సమావేశంలో ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పోసి.. మట్టుబెట్టి

- యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ సర్వయ్య

కేసముద్రం: మండల కేంద్రంలో ఈనెల14వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. మంగళవారం కేసముద్రం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేసముద్రంవిలేజ్ చైతన్యనగర్‌కాలనీలో ఉంటున్న జిలుకర నాగరాజుపై ఇదే గ్రామం జ్యోతిరావు పూలే సెంటర్ సమీపంలో నివాసముండే వల్లందాసు నగేశ్ కొంతకాలంగా వ్యక్తిగతంగా కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో నాగరాజును ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నాగరాజును నమ్మించేందుకు నగేశ్ చిన్న పనులు చెబుతూ హత్య చేయాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నగేశ్ భార్య ఉమ అనారోగ్యానికి గురవడంతో ఇటీవల నెల్లికుదురు మండలం బొద్లాడలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న నగేశ్ ఇదే అదునుగా భావించాడు. ఈ నెల 14న నాగరాజును నమ్మించి తన ఇంటికి రప్పించుకున్నాడు. మద్యం తీసుకరమ్మని డబ్బులు ఇవ్వడంతో నాగరాజు తీసుకువచ్చాడు. ఈ క్రమంలో నగేశ్ అన్నం తింటూ నాగరాజుకు మద్యం పోస్తూ వచ్చాడు. మద్యం సేవించిన నాగరాజు మత్తులో మునిగిపోవడంతో అతడి మెడపై కర్రతో కొట్టగా కిందపడ్డాడు. వెంటనే అపస్మారకస్థితిలో ఉన్న నాగరాజు గొంతుపై కాలితో తొక్కి చంపేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు వల్లందాసు నగేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

వ్యవసాయ రంగాల అభివృద్ధే లక్ష్యం

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజన్న

మామునూరు: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధే పరిశోధన స్థానం లక్ష్యమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 96వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ ప్రథమ స్థానంలో, చేపల పెంపకంలో రెండో స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం, ఉద్యాన పంటల్లో గణనీయమైన ప్రగతి సాధించామని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం, నూతన విధానాలతో వ్యవసాయ, వ్యవసాయ రంగాల అభివృద్ధి విషయంలో ముందుకు దూసుకెళ్తోందన్నారు. కృషి విజ్ఞానం కేంద్రంలోని సేవలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజు, శశాంక్, సాయి కిరణ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

- రూ. 8 లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మడికొండ సీఐ ప్రతాప్


బైక్‌ల చోరీకి పాల్పడుతున్న వారి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడికొండ : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం మడికొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రతాప్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జెన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంపెంగి రమేశ్ డ్రైవర్ పని చేస్తూ వచ్చిన ఆదాయంతో జల్సా చేసేవాడు. అయితే జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా తన స్నేహితుడు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామానికి చెందిన వాంకుడోత్ రాకేశ్‌తో కలిసి ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడడం ప్రారంభించారు. ఇందులో భాగంగా జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుమార్లు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడగా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మార్పు రాక పోగా మరోసారి చోరీలకు సిద్ధపడి హైదరాబాద్‌తోపాటు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మడికొండ, ఇంతేజార్‌గంజ్, పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై అప్రమత్తమైన మడికొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మడికొండ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రమేశ్ వాహనంపై వస్తుండగా అనుమానం కలిగి తనిఖీ చేయగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాలను అంగీకరించాడు. అనంతరం నిందితుడి సమాచారం మేరకు మరో నిందితుడు రాకేశ్‌ను అదుపులోకి తీసుకుని అతడి ఇంటి వద్ద నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మడికొండ ఎస్సైలు రాజాబాబు, దివ్య, ఏఎస్సై రమేష్, ఏఎంఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, రామ్‌నాథం, జంపయ్య, కానిస్టేబుళ్లు రవి, నాగేశ్వర్, ఐటీ కోర్ కమిటీ సభ్యులు నాగేష్, ప్రవీణ్‌ను సీఐ ప్రతాప్ అభినందించారు.

అద్దంకి దయాకర్‌కు సముచిత స్థానం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

హన్మకొండ : తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో జాతీయ మాల మహానాడు వరంగల్, హనుమకొండ జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కేయూ పాలక మండలిలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమలో క్రియాశీలక భూమిక పోషించిన మాలలకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నే బాబురావు, కార్యదర్శి అశోద భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు, మాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎలుక దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ అసాది పురుషోత్తం, వరంగల్ మహా నగర అధ్యక్షుడు అంకేశ్వరపు రామచందర్, నాయకులు పాల్గొన్నారు.







డీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి..

- రేపటి నుంచి ఆగస్టు 5 వరకు పరీక్ష
- ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఐదు కేంద్రాలు
- 27,741మంది అభ్యర్థులు
- నిర్దేశించిన సమయానికి 10 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకానికి టీజీడీఎస్సీ పరీక్ష నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి (రేపు) ఆగస్టు 5వ తేదీ వరకు ఈ పరీక్ష నిర్వహించబోతున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే అభ్యర్థులకు సంబంధిత వెబ్‌సైట్ హాల్ టికెట్లను కూడా అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఐదు పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌పద్ధతిలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) పరీక్ష నిర్వహించబోతున్నారు. ఐదు పరీక్షకేంద్రాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కిషన్ పుర, హసన్‌పర్తిలోని నోబుల్‌టెక్నాలజీ అండ్‌సొల్యూషన్స్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్టవద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, భీమారం సమీపంలోని పొద్దుటూరి గార్డెన్ దగ్గరలోని మోక్షిత కంప్యూటర్స్ పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక్కో అబ్జర్వర్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించి పరిశీలించనున్నారు.13 రోజులపాటు రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. రోజూ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులు రెండుగంటల ముందునుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్దేశించిన పరీక్ష సమయం ఉదయం 9 గంటలుకాగా 10 నిమిషాలు ముందుగానే ఉదయం 8.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత అభ్యర్థులకు లోపలికి అనుమతించరు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే పరీక్షలకు కూడా రెండు గంటల ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సింటుంది. మధ్యాహ్నం 01.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత వచ్చేవారిని లోపలికి అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాక బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును (ఐడింటీటీకార్డును) తీసుకుని రావాల్సింటుంది. ఐదు పరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 27,741మంది అభ్యర్థులు టీజీడీఎస్సీని రాయబోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు నియామకానికి ఎస్‌జీటీ తత్సమాన కేడర్‌లో టీచర్ల నియామకానికి ఈడీఎస్సీ నిర్వహించబోతున్నారు.పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దు. రాష్ట్రంలో మొత్తం 2.79 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారు.

వ్యవసాయ అనుబంధ రుణాలు పెంచాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవీందర్ రావు

హన్మకొండ : బ్యాంకులు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలకు రుణాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) ఆధ్వర్యంలో వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల బ్రాంచ్‌ల అధికారుల జోనల్ వర్క్ షాప్ ఆన్ బిజినెస్ అపార్చునిటీస్ ఫామ్ సెక్టార్, నాన్ ఫామ్ సెక్టార్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును రవీందర్ రావు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి నాబార్డు రూ.460 కోట్లు రుణాలు మంజూరు చేసిందన్నారు. నాబార్డు జీఎం ఉష మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలను ప్రోత్సహించడానికి నాబార్డు రాయితీ అందిస్తోందన్నారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్, ఫౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు ధర్మారావు, నాబార్డు డీడీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.